1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

ప్రమాదవశాత్తు బావిలో పడి పంచాయతీ వర్కర్ మృతి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

అనంతపేట్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్ పోలీస్ భీమరాజు(28) గ్రామ పంచాయతీకి చెందిన బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. బోర్ మోటార్ రిపేర్ కోసం బావిలో దిగి బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి నీటిలో మునిగి చనిపోయాడు. తండ్రి భీమన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ లింబాద్రి తెలిపారు. మృతుడికి భార్య సౌమ్య, బాబు ఉన్నారు.



మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి

తలమడుగు : తేమ శాతాన్ని మినహాయించి పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కోరారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రయివేట్ వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో మార్కెట్ ప్రారంభమై ఎనిమిది రోజులు కావస్తున్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించడం లేదని తెలిపారు. తేమ శాతం షరతులు లేకుండా మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకొని పంటలకు గిట్టుబాటు ధరలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘ నాయకులు బండి దత్తాత్రి, గోవర్ధన్ యాదవ్, లోకారి పోశెట్టి, లక్ష్మణ్, దేవిదాస్, రోకండ్ల రమేష్, ధరంసింగ్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తలమడుగు: మండలంలోని కుచులాపూర్ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ అంజమ్మ తెలిపిన వివరాల ప్రకారం...కిన్వట్ నుండి మ్యాక్స్ బొలెరో వాహనం సెంట్రింగ్ లోడ్‌తో ఆదిలాబాద్ వైపు వస్తోంది. డ్రైవర్ రిహాన్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో కుచులాపూర్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో యావత్‌మాల్‌కు చెందిన సచిన్(39) అక్కడికక్కడే మృతి చెందాడు. నాందేవ్, గోపాల్, అల్తాస్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సచిన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని నిరసన



ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ దీక్షలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బచ్చు నారాయణ, మెస్రం రాజ్‌కుమార్, చదల రాజేష్, మెట్పల్లి గోపాలకృష్ణ, జీజాబాయి, వీరయ్య, రవి, రాజేశ్వర్, దత్తాత్రి, కేశవ్, గోపాల్, రితేష్ పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాలు అందజేత



ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు కళాశాల లైబ్రరీకి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, పోస్టల్ సూపరింటెండెంట్ సిద్ధార్థ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఉన్నత స్థాయి చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ గంగాధర్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ ఉత్తం, కళాశాల లైబ్రేరియన్ కోటయ్య వైస్ ప్రిన్సిపల్ గణపతి, రఘు, పోస్టల్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గజిలీలో వైద్య శిబిరం



నేరడిగొండ : మండలంలోని గజిలీ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రతి ఇంటికి తిరుగుతూ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, హెచ్ఏ సాయన్న, ఆశా కార్యకర్త సిడాం భానుప్రియ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో 19 మందికి ఉద్యోగాలు

ఆదిలాబాద్‌టౌన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా మంగళవారం కారుణ్య నియామక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించిన కుటుంబం వారసులకు కారుణ్య నియామకంలో భాగంగా 19మందికి ఉద్యోగం కల్పించారు. ఇందులో 8 మందికి జూనియర్ అసిస్టెంట్, 10 మందికి ఆఫీస్ సబార్డినేట్, ఒకరికి వాచ్‌మెన్ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఏఓ రాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముథోల్: మెస్ ఛార్జీలు పెంచినందుకు మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి, నాయకులు గోపిడి ప్రేమ్‌నాథ్‌రెడ్డి, అజీజ్, దిగంబర్, కిషన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎస్‌కె నజీమ్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎం

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్వి.సూర్యనారాయణ కలెక్టర్ కుమార్ దీపక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపరితల గనుల భూసేకరణ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలు

- 33జిల్లాల నుంచి హాజరైన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఉట్నూర్

5వ రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలు-2024 కేబీ కాంప్లెక్స్‌లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 5 నుండి 7 వరకు జరిగే క్రీడా పోటీలను ఎంపీ గొడెం నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అతిథుల సమక్షంలో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. రన్నింగ్ బాలురు విభాగంలో ఉట్నూర్‌కు చెందిన విద్యార్థి పరుశురాం మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. బజార్‌హత్నూర్ మండలం జాతర్లకు చెందిన మహేష్, రెండవ స్థానంలో, ఏటూరు నాగారంకు చెందిన సతీష్ మూడో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో భద్రాచలం నుండి లిఖిత గోల్డ్ మెడల్ సాధించగా, రెండవ, మూడవ స్థానంలో చిన్నూబాయి, ప్రసన్న నిలిచారు. వారికి మెడల్స్ బహూకరించారు. పోటీలను ప్రారంభించి ఎంపీ నగేష్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో విజయాలు సొంతం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి పట్టుదలతో ఏదైనా సాధించవచ్చన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించామని, విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ కనబర్చి అన్నింటిలోనూ ముందుండాలని తెలిపారు. క్రీడల్లో రాణించే వారికి ఎక్కువగా తెలివితేటలు ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో చక్కగా ఆడి తమ ప్రతిభను చాటుకోవాలని తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉట్నూర్‌లో రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలను రెండోసారి జరుపుకుంటున్నామన్నారు. ఈ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు బొజ్జు, అనిల్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు వినియోగించుకొని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లాకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థులు ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 47 పథకాలు సాధించారని, లక్ష్యంతో బరిలోకి దిగితే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 33 జిల్లాల నుండి 1600 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, పార్థసారథి, భూక్యా రమేశ్, వివిధ జిల్లాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థి మృతి

- బంధువుల ఆందోళన
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగుల సస్పెన్షన్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్ బండ్ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ అయాన్ హుస్సేన్(14) ప్రతిరోజు లాగానే ఉదయం బేస్ బాల్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతికి గల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. బాలుడి స్వగ్రామం దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామం.

బంధువుల ఆందోళన

బాలుడి మృతి అనుమానాస్పదంగా ఉందని కుటుంబీకులు, బంధువులు అంబేద్కర్ విగ్రహం ముందు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. అయాన్ మృతికి పాఠశాల సిబ్బంది కారణమని ఆరోపిస్తూ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైటాయించారు. అధికారులు, సిబ్బంది సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా కొద్దిమేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆర్డీఓ రత్నకళ్యాణి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాలుడి మృతి దురదృష్టకరం : శ్రీహరిరావు

ఎంజేపీ పాఠశాల విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, గ్రంథాలయ చైర్మన్ పాఠశాలకు వెళ్లి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం, గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విషయాలకు అందుబాటులో ఉంటామని విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపారు. వీరి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, దేవరకోట దేవస్థానం చైర్మన్ కొండ శ్రీనివాస్, నాయకులు కొంతం గణేష్, గడ్డం నర్సారెడ్డి ఉన్నారు.

ఉద్యోగుల సస్పెన్షన్

విద్యార్థి షేక్ అయాన్ మృతి ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి ఆర్డీఓ రత్నకళ్యాణి ఆధ్వర్యంలో విచారణ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సంతోష్, ఉపాధ్యాయుడు టి.రమేష్, పీఈటీ పెంటన్న, హెల్త్ సూపర్వైజర్ సుజాతను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


కుటుంబ సభ్యుల ఆందోళన


మృతి చెందిన అయాన్

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు అభిలాష అభినవ్, రాజార్షి షా, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, శ్యామలాదేవితో కలిసి ఆయన అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు, సేకరించిన ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లోని వసతులు ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్, తేమ, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, సన్న వరి ధాన్యం నిర్ధారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరి ధాన్యానికి సంబంధించి మద్దతు ధర, ఇతర వివరాలు తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే కేటాయించిన మిల్లులు, గోదాములకు తరలించాలని సూచించారు. ప్రతి గోదాంలో సిసి టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్టర్‌లను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ప్రత్యేక అధికారులంతా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించి ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం అమ్మిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా బ్యాంకర్లు గ్యారెంటీ కల్పించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 287 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 1లక్ష 35వేల ఎకరాలలో వరి ధాన్యం పండించినట్లు తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని తూకపు, తేమ యంత్రాలు, గన్ని బ్యాగ్స్, టార్పాలిన్లతో సహా 40 శాతం అధికంగా సన్న వరి ధాన్యం నిర్ధారణ పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ఆదిలాబాద్ శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నిర్మల్ ఆర్డీఓ రత్న కళ్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం వేణుగోపాల్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.





ఫుడ్ పాయిజన్ కలకలం

- యువతి మృతి, నలుగురు ఉపాధ్యాయులకు అస్వస్థత





నవతెలంగాణ-బోథ్

ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో వంట మనిషి ప్రాణాలు కోల్పోగా నలుగురు ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పొచ్చెర గ్రామ సెయింట్ థామస్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ స్మితా, వైస్ ప్రిన్సిపాల్ దీపక్, ఉపాధ్యాయులు సీజీ, సోఫీ, వంట మనిషి ఫుల్‌కలిబాయ్‌గా ఈ నెల 2న నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళ్లారు. డీ మార్ట్‌లో షాపింగ్ ముగించుకొని సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఏఎన్‌రెడ్డి కాలనీలోని గ్రిల్ నైన్ రెస్టారెంట్‌కు వెళ్లారు. చికెన్-65, తందూరి చికెన్, ఫ్రైడ్ రైస్ చికెన్ భోజనం చేశారు. తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. అదేరోజు రాత్రి ఒంటి గంట సమయంలో ముందుగా ప్రిన్సిపాల్ స్మితాకు వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. ఆమెతో పాటు మిగతా వారికి కూడా వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో ఆందోళన చెంది 3న ఉదయం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. డాక్టర్ ఫుడ్ పాయిజన్ అయిందని తెలిపారు. చికిత్స పొందుతూ వంట చేసే యువతి మంగళవారం ఫుల్‌కలిబయ్‌గా(19) మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టరేట్ ముందు ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏవో రాజేశ్వర్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ అజయ్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండి, రఫియా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో 8నెలల నుండి కోడి గుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ధరకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులందరికి పీఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రతి కార్మికురాలికి నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలని, కోడి గుడ్డును, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రబియా, లక్ష్మి, సరిత పాల్గొన్నారు.

ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బంగారిగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం బంగారిగూడ నుండి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దాసరి అనిత(40) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ ఖదీర్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆటోలో ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ద్విచక్ర వాహనదారుడు అమర్‌కు సైతం గాయాలయ్యాయి. దాసరి అనిత కూలి పని చేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. కుటుంబ పెద్ద దిక్కు మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. దాసరి ఆకాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనిత కుటుంబానికి టైగర్ గ్రూప్ సభ్యులందరూ కలిసి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. టైగర్ గ్రూప్ అధ్యక్షులు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, ఇటువంటి సేవా కార్యక్రమాలకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైగర్ గ్రూప్ అధ్యక్షులు గోపాల్ జాదవ్, ఉపాధ్యక్షులు శశికాంత్, మహేష్, అజయ్, సాయిల్, సచిన్, అఖిల్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలు వినియోగించరాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించరాదని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని రెస్టారెంట్లు, హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించి పాటించవలసిన నియమాలపై సూచనలు చేశారు. ఈ నెల 2న రాత్రి సమయంలో నిర్మల్ గ్రిల్ నైన్ హోటల్‌లో ఆహారాన్ని తిని బోథ్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అయిదుగురు అస్వస్థతకు గురయ్యారని, అందులో మంగళవారం కుక్ ఫుడ్ పాయిజన్‌తో చనిపోయారని తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు గ్రిల్ నైన్ యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కుళ్లిన, తేదీ అయిపోయిన పదార్థాలను వంటలలో వినియోగించరాదని తెలిపారు. వినియోగించిన ఆయిల్‌ను ఎక్కువసార్లు వినియోగిస్తూ ఉండరాదని, ప్రతి సందర్భంలో ఆయిల్‌ను మారుస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన ఫుడ్ కలర్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వంటకాలలో వినియోగించకూడదని సూచించారు. పరిశుభ్రతను, స్టాండర్డ్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఎలాంటి క్రిములు, కీటకాలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సీఐలు సునీల్, కరుణాకర్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ మండలంలోని పాత తర్లపాడు గ్రామానికి చెందిన పదేండ్ల పూసం శ్రీరామ్ గంగయ్యపేటలోని మేనత్త ఇంటికి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన ఆ బాలుడు తిరిగి పాత తర్లపాడుకు వస్తుండగా మధ్యలో దారితప్పి ఎటు వెళ్లాలో తెలియక సుభాష్ నగర్ మదీనా కాలనీ ఏరియాలో ఏడుస్తూ కూర్చున్నాడు. దీని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన బ్లూ కోర్టు సిబ్బంది అక్కడికెళ్లి ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు తెలుసుకున్నారు. పాత తార్లపాడు గ్రామానికి తీసుకువెళ్లి తన తల్లిదండ్రులకు అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించి తప్పిపోయిన బాలుని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించిన బ్లూ కోర్టు సిబ్బంది బి.సంతోష్ నాయక్, జి.రవీందర్, రైటర్ రవి నాయక్, మణింద్రలను ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై గైక్వాడ్ రాహుల్ అభినందించారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా నూతన జిల్లా వైద్యాశాఖధికారిగా బాధ్యతలు చేపట్టిన నరేందర్ రాథోడ్‌ను మంగళవారం యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే అత్యంత ఆదివాసులు వెనుకబడిన ప్రజలు ఉన్న బేల మండలంలో ఎప్పటి కప్పుడు హెల్త్ క్యాంపులు నిర్వహించి సామాన్య ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, ఎండీ అఖిల్, కిరణ్ ఉన్నారు.

తేమ శాతం మినహాయింపుతో పత్తి కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-తాంసి

తేమశాతం పూర్తి మినహాయింపుతో పత్తినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి అన్నారు. రైతు సంఘం నాయకులతో కలిసి మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ నలంద ప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ మినాయింపుతో పత్తి కొనుగోళ్లు చేసి మద్దతు ధర ఇవ్వాలని కోరారు. మార్కెట్ అధికారులు ప్రయివేట్ వ్యాపారులు కుమ్మకై రైతుల పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వకుండా తేమ శాతంతో రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతుభరోసా ఎకరానికి రూ.15 వేలు రెండు విడతల డబ్బులను తక్షణమే రైతుల ఖాతాల్లో జామచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు రోకండ్ల రమేష్, భక్కి గోవర్ధన్ యాదవ్, చిలక దేవిదాస్, కేమ లక్ష్మణ్, నాగయ్య యాదవ్, లోకారి పోశెట్టి, ధోనిపెల్లి స్వామి ఉన్నారు.

మెరిట్ స్కాలర్షిప్ పుస్తకాలు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యూత్ ఫర్ సేవ ఏకలవ్య ఫౌండేషన్ సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రణదీవేనగర్ విద్యార్థులకు 13 నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పుస్తకాలను మంగళవారం అందించారు. ఏకలవ్య ఫౌండేషన్ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందని వారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బేరా దేవన్న, ఫౌండేషన్ ప్రతినిధి ప్రశాంత్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, హరిబాబు గంగేశ్వర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన రెంజర్ల లక్ష్మీ(45)ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పథని నర్సయ్య మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు భోజన్న, చిన్నయ్య, సుభాష్, సాయందర్(లడ్డు), మురళీ, శివకర్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ షెడ్యూల్ క్యాస్ట్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ క్షితిజను హైదారాబాద్‌లో మాదిగ జేఏసీ ఉపాధ్యక్షులు నక్క రాందాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎస్సీ కార్పొరేషన్‌కు అన్ని రకాల నిధులు మంజూరు అయ్యేలా చూడాలని ఆమెను కోరారు. జిల్లా వ్యాప్తంగా 564 పట్టా భూములలో భూగర్భ జలాల సర్వే అనంతరం కూడా బోరు బావులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తొందరగా మంజూరు చేయించి దళిత వ్యవసాయదారులకు సంపూర్ణ సహకార అందించాలని విన్నవించారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించినట్లు రాందాస్ పేర్కొన్నారు. అలాగే ఎస్సి కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉద్యోగ విరమణ సహజం



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ఈఈగా సేవలో అందించి ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన రాథోడ్ భీమ్‌రావును మంగళవారం ఉట్నూర్‌లోని తన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. గిరిజనులకు అందించిన సేవలు గొప్పవని, ఉత్తమ సేవలు మర్చిపోలేరని అన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఇచ్చోడ, నేరడిగొండ మాజీ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, సజన్, నార్నూర్ ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేష్ ఉన్నారు.

పాఠశాలలో ఎన్నికల నిర్వహణ

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో అసెంబ్లీ, పార్లమెంటరీ మాదిరిగా మంగళవారం ఎన్నికలు నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొని బాలుర గ్రూప్ లీడర్‌ను, బాలికల గ్రూప్ లీడర్‌లను ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకున్నారన్నారు. పాఠశాల స్కూల్ లీడర్‌గా బి హర్షవర్ధన్, బాయ్స్ లీడర్‌గా కే. గంగబాబు, గర్ల్స్ లీడర్‌గా డి.సింధు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య



నిర్మల్: సోన్‌లో కొనుగోలు కేంద్రం గురించి తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు టెంట్, తూకపు, తేమ యంత్రాలు, గన్ని బ్యాగ్స్, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం కేటాయించిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలును వేగవంతం చేయాలని, అన్ని రకాల రిజిస్టర్‌లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ మల్లేష్, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, సివిల్ సప్లయి డీఎం వేణుగోపాల్, రైతులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్ : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని చించాల, వెంకటాపూర్, కారేగాం చింతకుంట, బోరేగాం, వడ్తాల్, విట్టోలి, ముధోల్ గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. రైస్ మిల్లర్ల కోతలను ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్, వైస్ చైర్మన్ సాయిరాం, మాజీ ఎంపీపీ ఎజాజొద్దిన్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాద్, నాయకులు సాంబ్లీ రమేష్, నర్సాగౌడ్, నిమ్మ పోతన్న, దత్తాద్రి, శివరాం, రోల్ల రమేష్ సుదర్శన్, శ్రీనివాస్, సంతోష్, గంగాధర్, భూమన్న, భీమేందర్, హన్మండ్లు, సాయినాథ్, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కడెం : మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ శైలజా రమేష్ రావు మంగళవారం ప్రారంభించారు. రైతులు పండించిన పంటలను బయటి దుకాణాల్లో కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, ఏపీఎం రాజారాం, మాజీ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, మాజీ ఎంపీటీసీలు కట్ల సింధూజ సాగర్, ముత్తినేని తిరుపతి, మాజీ సర్పంచ్ రెంకల రాజన్న, ఖానాపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్, సీసీలు స్వామి, జ్యోతి,మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్ల పెల్లి రమేష్,పాక భూమన్న పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని మలక్ చించోలో డీసీఎంఎస్, ధని, చించోలి(బి) గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది ప్రారంభించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రహించి ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2320, బి గ్రేడ్ రూ.2300 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీదేవి, ఏఓ వికార్ అహమ్మద్, ఐకేపీ ఏపీఎం మాధురి, మార్కెట్ వైస్ చైర్మన్ శంకర్ రెడ్డి, డైరెక్టర్ ముక్తార్, నాయకులు నరేష్, గంగాధర్, మారుతి, రమేష్, నర్సయ్య, లక్ష్మణ్, మల్లయ్య, శేఖర్, సురేందర్, రైతులు పాల్గొన్నారు.



ముధోల్ : తూకం వేసి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉత్సాహంగా హ్యాండ్ బాల్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడలతో అనేక లాభాలున్నాయని, జట్టుతో కలిసి పట్టుదలతో ఆడటమనేది జీవితంలో ఏదైనా సాధించాలన్న తపనను పెంపొందిస్తుందని హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిని రవికుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం హ్యాండ్ బాల్ జోనల్ స్థాయి అండర్ 14 బాల బాలికల ఎంపిక పోటీలను నిర్వహించారు. జోనల్ స్థాయిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్ లు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హ్యాండ్ బాల్ అసిసియేషన్ అధ్యక్షుడు సాయిని రవికుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్ తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడల శారీర, మానసిక వికాసంతో పాటు లక్ష్యం దిశగా పట్టుదలతో సాగే ప్రేరణను అందిస్తాయని హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిని రవికుమార్ అన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో స్పోర్ట్స్ కోటా ద్వారా రిజర్వేషన్లు పొందవచ్చన్నారు. రాష్ట్రస్థాయిలో టోర్నీకి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10 వరకు మహబూబాద్లో జరిగే స్టేట్ మీట్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పిల్లి కిషన్, పీడీ నడిమెల్ల హరిచరణ్, అరవింద్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఖోఖో ఎంపిక పోటీలు

క్రీడ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభను కనబర్చి జిల్లాకు గొప్ప గుర్తింపు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉష్కం రఘుపతి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర విభాగంలో జోనల్ స్థాయి అండర్-14, 17 కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలను మంగళవారం పట్టణ శివారులోని రిసోనెన్స్ పాఠశాలలో నిర్వహించారు. జోనల్ స్థాయిలోని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ కుమురంభీం, మంచిర్యాల జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఒక్కో జిల్లా నుంచి 12 మంది క్రీడాకారులు, ఇద్దరు కోచ్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి, ఎస్‌ఏఫ్ కార్యదర్శి కాంతారావ్ తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జోనల్ స్థాయిలో అండర్- 14, అండర్ 17 విభాగంలో ఒక్కో జట్టును ఎంపిక చేస్తారు. ఈ నెల 7 నుంచి 9 వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా తరపున ఈ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయని ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి కాంతారావ్ తెలిపారు. కార్యక్రమంలో రెసెనెన్స్ స్కూల్ డైరెక్టర్ ప్రమోద్ రెడ్డితో పాటు 4 జిల్లా పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ప్రత్యేక కృషి చేస్తుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తల్లి తండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలోనే చేర్పించాలని సూచించారు. పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో విద్యా బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఉపాధ్యాయులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కారించాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం జడ్పీ హై స్కూల్‌లో పోస్టర్లను విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఓకే ఒక డీఏను మాత్రమే విడుదల చేసిందన్నారు. ఆ పరిష్కృత మిగత ఐదు డీఏలను సైతం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్మోహన్, భాస్కర్ రెడ్డి, జ్యోష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆదర్శ నగర్(జీన్ గూడ)కు చెందిన రాజ్‌పంగే బాలాజీ కుమారుడు రాజ్ పంగే పరమేశ్వర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బాధిత కుటుంబ సభ్యలను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పెసా చైర్మన్ రాథోడ్ సికిందర్, శాంతారావ్, అల్తాఫ్ ఖాన్, నసిరూల్ల ఖాన్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

పెండింగ్‌లో ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయక పోవడంతో చదువులకు దూరం అవుతున్నారన్నారు. యజమాన్యాలు కాలేజీలకు తాళాలు వేసి రోడ్ల పైన ధర్నా చేసే పరిస్థితికి తీసుకొచ్చిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్‌దని మండిపడ్డారు. విద్య శాఖ మంత్రిని నియామించాలని కొరారు. హాస్టల్స్‌లలో ఉండి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోట్ చార్జీలు పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబా శ్యామ్ టైగర్, క్రాంతి, భూమన్న, సాజిద్, జడి వెంకటేష్, శ్రీకాంత్, దినేష్ పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎస్టీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్ కోరారు. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయనను శాలువతో సత్కరించారు. ప్రభుత్వం ఇటీవల జిల్లా కేంద్రంలో బట్టిసావర్గం శివారులో సర్వే నంబర్ 72/28/1/2గల స్థలాన్ని నిర్మాణానికి కేటాయించిందని తెలిపారు. నిర్మాణం కోసం నిధులు కావాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు.

హీరాసుక్క మందిర నిర్మాణానికి కృషి

నవతెలంగాణ-నార్నూర్

హీరాసుక్క విగ్రహ ప్రతిష్ఠాపన మందిర మందిర నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం గాదిగూడ మండల ప్రధాన్ సమాజ్ పెద్దలు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. గోండి ధర్మ గురు హీరాసుక్క విగ్రహ ప్రతిష్టపణ, మందిర నిర్మాణానికి తనవంతు సహకారం అందించారు. ఇందులో గ్రామ సమాజ్ పెద్దలు తొడసం శ్యాంరావ్, మేస్రం వెంకటేష్, నైతం గోవింద్ రావ్, మేస్రం గోవింద్ రావ్, ముత్యాలు, పర్చకి కీషన్, కుమ్ర మారుతి, కోడప దేవ్‌రావ్, గేడం పరశురామ్, పాండురంగ్, భారత్, ఆత్రం వామన్, గంగారాం, కోడప చంద్రశేఖర్, గేడం జ్ఞానేశ్వర్ ఉన్నారు.

దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపాలిటీ పరిధిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నగేష్ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజునుకలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తగా వికలాంగులకు ఎస్‌హెచ్‌జీ గ్రూపులు నిర్మించి వారికి లోన్ ఇచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే స్ట్రీట్ వెండర్ షాపులలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలని విన్నవించారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నగేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యంగులున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

మంగళవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మంగళవారం రిటైర్డ్ ఎంపీడీఓ ఎల్ఎన్ గజ్జారాం చట్ల మనవళ్ళ అద్విక్ గౌరవ్, అన్విత్ సౌరవ్‌ల పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ద్వారా రోగులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎల్ఎన్ గజ్జారాం చట్ల దంపతులు, కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులున్నారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కెరమెరి



జిల్లాలో వసతి గృహాలలో సమస్యలు నెలకొన్నాయని ప్రభుత్వం వాటిని పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఆర్ఓ ప్లాంట్ మంజూరైన, పనిచేయడం లేదన్నారు. శుద్ధజల యంత్రం సైతం పని చేయకపోగా విద్యార్థులు బోర్ నీళ్లు తగుతున్నారన్నారు. చలి కాలం కావడంతో విద్యార్థులు చల్లటి నీళ్లతో స్నానాలు చేయాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వాడై తిరుపతి పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు ఎస్పీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని మానేపల్లి శిరీష నీట్‌లో ప్రతిభ కనబరిచింది. ఉత్తమ ర్యాంకు సాధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో సీటు పొందింది. ఎస్సై రామారావు చొరవతో వచ్చిన మొత్తాన్ని విద్యార్థినికి ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు రూ.25000 ఆర్థిక సాయం అందజేశారు. ఎంబీబీఎస్ సీట్ సాధించినందుకు ఆమెను శాలువతో సన్మానించి, జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శిరీష సాధించిన ఈ గొప్ప విజయం చాలామంది విద్యార్థులకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, కొలవర్ సంఘం జాతీయ అధ్యక్షులు సుంకే కృష్ణయ్య పాల్గొన్నారు.

దండారీలకు పారితోషికం అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆదివాసుల దండారి (గుస్సాడీ)లకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఉత్సవ నిర్వహణ ఖర్చులకు రూ.15000 చెక్కును ఆయా నిర్వహణ కమిటీ సభ్యులకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కతిని కాపాడి భావితరాలకు అందించాలన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని నిర్వహించే దండారి ఉత్సవాలకు ప్రభుత్వం దండారికి రూ.15 వేల చొప్పున అందిస్తుందని, ఆదివాసులు దండారి సంస్కృతిని కాపాడి భావితరాలకు అందించాలన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలో 22 దండారీలకు రూ.3 లక్షల 30 వేలు, తిర్యాణి మండలంలో 37కు రూ.5 లక్షల 55 వేలు, వాంకిడి మండలంలో 30కు రూ.4.5లక్షలు, జైనూర్ మండలంలో 50కు రూ.7.50 లక్షలు, కెరమెరి మండలంలో 36కు రూ.5.40 లక్షలు, లింగాపూర్ మండలంలో 20కు రూ.3 లక్షలు, సిర్పూర్-యు మండలంలో 41కు రూ.6 లక్షల 15 వే, కాగజ్‌నగర్ మండలంలో 9కు రూ.1 లక్ష 35వేలు, రెబ్బెన , సిర్పూర్(టి) మండలంలో ఒక్కంటికి రూ.15వేలు మొత్తం రూ.37 లక్షల 5 వేల చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. గుస్సాడి కళను ప్రపంచానికి పరిచయం చేసిన కనకరాజు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. జంగుబాయి, జోడేఘాట్, మార్లవాయి ప్రాంతాలలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి జిల్లా యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా జోడేఘాట్ ప్రాంతం ఆధునీకరణకు పర్యాటక మంత్రిత్వ శాఖ రూ.4.8 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు చేపట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే దండారి ఉత్సవాలను ప్రభుత్వం మరింత వైభవోపేతంగా నిర్వహించేందుకు దండారికి రూ.15వేల చొప్పున అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరం నగదు మరింత పెంచి అందించే అవకాశం ఉందని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ భావితారాలకు అందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు మండల సహాయ కార్యదర్శి బి జగ్గయ్య, పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్ హాజరై జెండాను ఆవిష్కరించి ఏఐటీయూసీ చరిత్ర, సాధించిన హక్కులు, పోరాటాలు, త్యాగాల గురించి కార్మికులకు వివరించారు. 105 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ కార్మికుల హక్కులే ధ్యేయంగా ముందుకు సాగామన్నారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిలు శేషశైనా రావు, జూపాక రాజేష్, దేవరకొండ దివాకర్, మీస చంద్రశేఖర్, డి రాజయ్య, ఫిట్ కార్యదర్శి కందుల మల్లేష్, సురేష్ కోరి, కాంటాక్ట్ కార్మికుల బ్రాంచ్ కార్యదర్శి సల్లూరి సహాయ అశోక్, కార్యదర్శి సాగర్ గౌడ్, నాయకులు అల్లాడి కోటి, ఆవుల మల్లేష్, ఎండి జమీల్, శమీ, లవ రాజు, వసీం, రాజు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన డీపీఎం యశోదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 18వేల మంది వీఓఏలు 22 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని, వీరికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తూ కుటుంబ పోషణ కష్టమైన మహిళ సంఘాలు, బృందాలను ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తూ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా రుణాలు ఇప్పించి తిరిగి సక్రమంగా చెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏ యూనియన్ జిల్లా కన్వీనర్ భీమేష్, కోకన్వీనర్ శ్రీధర్, నాయకులు కృష్ణ, రవి, తిరుపతి, లింగన్న, రజిత, కవిత, రాజేశ్వరి, సురేఖ, రాంచందర్, వెంకటేష్, శంకర్, శంకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-బెజ్జూర్

ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులకు మంగళవారం ఎంఈఓ సునీత శిక్షణను ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాస్ పరీక్షను నిర్వహించాలని సూచించారు. పరీక్ష కోసం విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు మహేందర్, అరవింద్ ఉన్నారు.

'బండ రాళ్లపై పడుకోబెట్టి నరకం చూపించారు'

- విజిలెన్స్ డీఎఫ్ఓ ముందు గోడు వెళ్లబోసుకున్న బాధితులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

చిన్న తప్పు చేసినా, ఏ తప్పు చేయకున్నా మమ్మల్ని బాధ్యులను చేసి అటవీ అధికారులు రేంజ్ కార్యాలయానికి తీసుకువచ్చి కింద బండ రాళ్లు వేసి వాటి మీద పడుకోట్టి కర్రలతో చితకబాది నరకం చూపించారం'టూ బాధితులు మంగళవారం విజిలెన్స్ అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అటవీ అధికారుల తీరును నిరసిస్తూ సిర్పూరు (టి) రేంజ్ కార్యాలయం ముందు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు నిరవధిక దీక్ష చేసిన విషయం తెల్సిందే. దీనికి స్పందించిన విజిలెన్స్ అధికారులు మంగళవారం సిర్పూరు రేంజ్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విజిలెన్స్ డీఎఫ్ఓ రాజశేఖర్ సిర్పూరు రేంజ్ కార్యాలయానికి వచ్చి ముందు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో మాట్లాడారు. డివిజన్‌లో అటవీ అధికారులు చేస్తున్న ఆగడాలను రైతులతోనే చెప్పిస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఒక్కో బాధిత రైతును పిలిచి చెప్పించారు. సిర్పూరు మండలం ఇటికల్‌పహాడ్, భూపాలపట్నం, లక్ష్మీపూర్, పెంచికల్‌పేట మండలం కొండపల్లి, ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని దింద గ్రామాలకు చెందిన రైతులు తాము అటవీ అధికారుల చేతుల్లో తాము పడ్డ బాధలను ఆవేదనగా చెప్పుకున్నారు. ఈ విచారణలో విజిలెన్స్ డీఎఫ్ఓ రాజశేఖర్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ వేణుబాబు (మంచిర్యాల), విజిలెన్స్ ఎఫ్ఆర్ఓ వీరేశం (హైదరాబాద్), ఫ్లయింగ్‌స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ రమాదేవి (మంచిర్యాల), కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ఎం రమేష్‌లు పాల్గొన్నారు.

విచారణలో రైతులు చెప్పినవాటిలో కొన్ని...

- కుక్కల దాడిలో జింక మృతి చెందితే ఆ నేరాన్ని తమపై మోపి 13 మంది నుండి రూ. 2.60 లక్షలు వసూలు చేశారని, మరో ఐదుగురు రైతులను ఒక్కక్కరి నుండి రూ. లక్ష డిమాండ్ చేయగా వారు ఇవ్వకపోవడంతో వారిని రిమాండ్‌కు తరలించారని సిర్పూరు మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన రైతులు డీఎఫ్ఓ ముందు వాపోయారు. డబ్బులు ఇవ్వని తనను రేంజ్ కార్యాలయంలో గదిలోకి తీసుకుపోయి కింద కంకర రాళ్ల పోసి వాటి మీద బోర్లా పడుకోబెట్టి కాళ్లను వెనుకకు మడిచి అరికాళ్లపై కర్రలతో కొట్టి నరకం చూపించారంటూ తనను కొట్టిన గదిని కూడా విజిలెన్స్ డీఎఫ్ఓకు ఆ గ్రామ రైతు చూపించాడు.
- తన భర్త ఏం తప్పు చేయకున్నా అడవి పందిని చంపారనే కారణంగా తీసుకువెళ్లి చితకబాదారని, ఇపుడు గాయాలతో జైలు పాలయ్యాడని సిర్పూరు మండలం లక్ష్మీపూర్ బెంగాళీ క్యాంప్‌కు చెందిన అపర్ణ డీఎఫ్ఓ ముందు వాపోయింది.
- లావాణి పట్టా భూమిలో జేసీబీతో మట్టి తవ్వితే తన జేసీబీని తీసుకువచ్చి సిర్పూరు రేంజ్ కార్యాలయంలో ఉంచాడని, ఈ విషయమై డీఎఫ్ఓను కలిస్తే ముందు రూ. 6.50 లక్షలు డిమాండ్ చేశాడని, చివరికి రూ. 5 లక్షలు ఇవ్వమని చెప్పినట్లు విజిలెన్స్ డీఎఫ్ఓకు వివరించాడు. డబ్బులు ఇవ్వలేదు కాబట్టి ఇప్పటికీ తన జేసీబీ రేంజ్ కార్యాలయంలోనే ఉన్నట్లు కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామ రైతు వాపోయాడు.
- ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా అటవీ ప్రాంతంలో కలప చెట్లు పెద్ద మొత్తంలో నరికివేతకు గురయ్యాయని, ఈ నరికిన చెట్లను ఫారెస్ట్ అధికారులే అడవిలో ఒక చోట చేర్చి అమ్ముకుంటున్నారని దిందాకు చెందిన రైతు రాము విజిలెన్స్ డీఎఫ్ఓకు ఫిర్యాదు చేశాడు.

ఎమ్మెల్యే ఫిర్యాదుపై కదిలిన ప్రత్యేక బృందం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి అటవీ రేంజ్ పరిధిలోని కేతిని, బండేపల్లి, దింద గ్రామ సమీపంలో బీట్ శివారులో వందలాది చెట్లు నరికివేతకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ డీఎఫ్ఓ రాజశేఖర్, ముకుంద్ రెడ్డి, అటవీ శాఖ సిబ్బందితో కలిసి మంగళవారం ప్రత్యేక బృందం పర్యటించారు. బండేపల్లి శివారులో గల అటవీకి ఆనుకొని ఉన్న వ్యవసాయ చేనులను పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కర్జెల్లి రేంజ్ పరిధిలోని బండేపల్లి బీట్ లో వందల చెట్లను నార్కివేతకు గురైయి అటవీ శాఖ వారు మాఫియా నడుపుతున్నారని ఆరోపించారు. కానీ ఈ ప్రాంతంలో చూస్తే అందుకు భిన్నంగా ఉందని అంత పెద్దగా కలపకు ఉపయోగపడే చెట్లు కనిపించడం లేదని, పెద్దగా కలుపకు ఉపయోగపడే చేట్లు ఏమి నరకలేదని, నరికినవి అన్ని చిన్న చిన్న చెట్లు మాత్రమేనని అన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉందని అన్నారు. చుట్టు పక్కల వ్యవసాయం చేసుకొని ఓ మహిళ రైతుతో మాట్లాడితే 30ఏళ్లుగా ఇక్కడే వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నమని, పత్తి పంటను వన్యప్రాణులు ధ్వంసం చేస్తున్నాయని, ఈ చిన్న చిన్న చెట్లు తామే నరికి దడి, పెట్టి వల కొనుగోళుచేసి పంటకు నష్టం వాటిల్లకుండా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారని అన్నారు. సిబ్బందిలో ఏ లోపాలు ఉన్నాయి అని పూర్తి స్థాయిలో విచారణ జరిపి అవసరం అయితే సిబ్బందిని పెంచుతామన్నారు. ఆయన వెంట విజిలెన్స్ డిప్యూటి రేంజర్ ఆసీఫోద్దిన్, డిప్యూటి రేంజర్ కాటెపెల్లి సంతోష్, ఎఫ్ఎస్ఓ అత్తర్, మోహన్, ఎఫ్బీఓ దినేష్, నవ్య సిబ్బంది ఉన్నారు.

మంత్రి శ్రీధర్ హామీతో ఎమ్మెల్యే దీక్ష విరమణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రంలోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయం ఎదుట రెండు రోజులుగా ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. మంగళవారం మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీఎఫ్ ఇచ్చిన హామీతో దీక్షను విరమించారు. ఈ దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఎంపీ జి.నగేష్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరంపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని, ప్రజలు కట్టే పన్నుతో జీతాలు తీసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు ప్రజా వ్యతిరేకులుగా మారితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో టైగర్ జోన్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తుందని తెలిపారు. టైగర్ క్యారిడాను ఏర్పాటు చేయడం వల్ల రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదన ఉపసహరించుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులపై బాధితులు తిరగబడితే పరిస్థితి చేయిజారి పోతుందని, అటవీ అధికారులు తిరగ లేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు హామీ మేరకు దీక్ష విరమిస్తున్నానని, ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకొనడమే కాకుండా అటవీ శాఖ అధికారులు చేస్తున్న అక్రమాలపై హైదరాబాదులో సమీక్షా సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. రెండు రోజులుగా పీసీసీఎఫ్ ఏలు సింగ్ విజిలెన్స్ విచారణ ప్రారంభమైందని, అక్రమాలకు పాల్పడిన అధికారులను ఎవరిని వదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, వానూ పటేల్, సీనియర్ నాయకులు నీరటి సత్యనారాయణ, ఒడ్డేటి నాని, కొప్పుల శంకర్, మనోహర్ గౌడ్, సాంబయ్య, నేరెల్ల అశోక్, సుధాకర్, వెంకన్న, రాజారాం, అశోక్, తిరుపతి పాల్గొన్నారు.

సెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ సెపక్ తక్రా సంఘం ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రిక్కుల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల రిటర్న్ రింగ్ అధికారి డీఎల్ నర్సింహా రావు తెలిపారు. రిక్కుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతు సెపక్ తక్రా క్రీడను రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధి చేసి జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా జట్టుకు పథకాలు తీసుకువచ్చేల కృషి చేస్తానని అన్నారు. ఆయన ఎన్నికపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ నారాయణ రెడ్డి, అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పార్థసారథి, సెపక్ తక్రా జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ తిరుపతి, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఫుడ్ పాయిజన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గత నెల 29న ఆహారం వికటించి దాదాపు 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయి కుమార్, చాపిలె సాయిక్రిష్ణలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకుండా జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు నడుస్తున్నాయని, అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందన్నారు. ఆశ్రమ పాఠశాలలో సంఘటన జరిగి ఎనిమిది రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ కూడా ఫుడ్ పాయిజన్‌కి కారణం ఏంటో తెలియకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సందర్శించినప్పటికీ ఒక స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయి కష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ పరామర్శ..

ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం వాంకిడి మండలకేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి 60 కి పైగా మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. అందులో ఇద్దరు విద్యార్థులు సీరియస్‌గా ఉంటే మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంటే వారిని హైదరాబాద్‌కి తీసుకెళ్లారన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేకుండా వైద్యం అందిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వేముల వైష్ణవి, అజయ్ పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగం సాధించిన జవాన్‌కు సన్మానం



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రానికి చెందిన గిరిందర్ ఇటీవల ఆర్మీలో ఉద్యోగం సాధించడంతో ఆయనను మంగళవారం టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్ శాలువాతో సన్మానించారు. పేద కుటుంబానికి చెందిన గిరిందర్ ఆర్మీలో ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషించాల్సిన విషయమన్నారు. ట్రేనింగ్ పూర్తి చేసుకొని మండల కేంద్రానికి రావడంతో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగిటి మల్లయ్య, ఇగురపు వెంకటేష్, సల్మన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తెలుగు భాషపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా తెలుగు భాషపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రతి తరగతిలో ఒక గ్రంథాలయ పీరియడ్ ఉండాలన్నారు. అదేవిధంగా రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ లిట్రసి న్యూమరసి అంశంపై ఒకటి రెండు తరగతులకు తెలుగు బోధించే ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్యాంసుందర్, శ్రీనివాస్, రూమ్ టు రీడ్ ప్రతినిధి వెంకన్న పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

నవతెలంగాణ-కౌటాల



ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం మండలం సాండ్‌గాం గ్రామ రైతు వేదికలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుపై రైతులు, వ్యవసాయ, విస్తరణ అధికారులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 15 తరువాత ధాన్యం వచ్చే అవకాశమున్నందున అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలను ఆ ప్రాంత రైతులకు సమాచారం తెలియజేయాలన్నారు. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో తప్ప, తాలు, తేమ లేకుండా నిబంధనల ప్రకారం తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని, ధాన్యం తూకం అయిన తర్వాత వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి జొన్నరకం ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాలు వాంకిడి, హుడ్కి ఐతేలి, వెంకట్రావుపేట, గూడెం వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. త్వరలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కుమ్మరి లింగయ్య, మహేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

గిరిజన విద్యార్థులకు బుక్స్ అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని గిరిజన గ్రామమైన అల్లినగర్ ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు మంగళవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎఫ్ఆర్ఓ సుష్మారావులు నోటు పుస్తకాలు బ్లాంకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులు బ్లాంకెట్లు అందజేసిన స్లేట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్నామన్నారు. చిన్నారులకు ఈ సహకారాన్ని అందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



ఆర్కే-5 గని మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై మందమర్రి ఏరియా శాంతిఖని ఏజెంట్‌గా బదిలీపై వెళ్తున్న అబ్దుల్ ఖాదీర్‌ను ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ ఖాదీర్ గని మేనేజర్‌గా పనిచేసి గత రెండు సంవత్సరాలుగా గనిలో 100శాతం ఉత్పత్తిని సాధించారని, ఇదే స్ఫూర్తితో శాంతిఖని గనిలో కూడా ఉత్పతి లక్ష్యాలను సాధించే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఆర్కే-5, 6 గ్రూప్ గనుల ఏజెంట్ శ్రీధర్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్ కుమార్, మల్లయ్య, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు పాల్గొన్నారు.

జల వనరులను కాపాడుకోవాలి

● జిల్లా భూగర్భ జల శాఖ అధికారి లావణ్య



నవతెలంగాణ-జైపూర్

జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జిల్లా భూగర్భ జల శాఖ అధికారి లావణ్య అన్నారు. మంగళవారం ఇందారం జిల్ల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భూగర్భ జల నిర్వాహణపై అవగాహణ కల్పించారు. పారిశ్రామిక ప్రాంతంలో నీటి నిలువ చేసుకోవడం, పొదుపుగా వాడుకోవడం ముఖ్యమని అన్నారు. వర్షపు నీటిని వృధా కానివ్వకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సహాయ భూజల భౌతిక శాస్త్రవేత్త గణేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నీటి వినియోగం పట్ల అవగాహణ పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదుకుని సమాజానికి మంచి సేవను అందించాలని ఆకాంక్షించారు. ఈ విషయమై విద్యార్థులకు వ్యాస రచన, పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. వ్యాసరచన పోటీలో బహుమతులు పొందిన శిరీష, రాజవర్ధన్, నవీన్‌లను అభినందించారు. కార్యక్రమంలో జల శాస్త్రవేత్త దివ్య పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, గోపగాని రవీందర్, రమేష్, సంధ్య, కనకయ్య ఉన్నారు.

గీతకు వచ్చిన గీరిక తాటి చెట్లు



నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఎక్కడ లేని గీరిక తాటి చెట్లు మండలంలోని బాదంపెల్లి గ్రామంలో పెంచిన చెట్లు ప్రస్తుతం కల్లు గీతకు వచ్చాయి. ప్రముఖ మిషన్ భగీరథ కాంట్రాక్టర్ మాదాడి పూర్ణచందర్ రావు 2020లో బాధంపెల్లిలోని గౌడ కులస్తులకు ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ నుండి 600 గీరిక తాటి చెట్లు తెప్పించి అందజేశారు. ఇప్పుడు అవి పెరిగి గీతకు సిద్ధం కావడంతో మంగళవారం నుంచి గీత కార్మికులు కల్లు గీయడం ప్రారంభించారు. ఎలాంటి కాలాన్ని అయినా తట్టుకునే గీరక తాటి చెట్లు తమకు ఉచితంగా అందించిన కాంట్రాక్టర్ పూర్ణ చందర్ రావుకు ఈ సందర్భంగా గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పోడేటి రవి గౌడ్, గ్రామానికి చెందిన గీత కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

దండారీ ఉత్సవాలు ముగింపు



నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ గ్రామాల్లో మంగళవారం దండారీ ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సాలెగూడ గ్రామంలో ప్రతి ఏటా దీపావళి ముందు నుండి దండారీ ఉత్సావాలను ఆదివాసీ అడవి బిడ్డలు తమ సంప్రదాయాలతో ప్రారంభించి, పది రోజుల పాటు నియమ నిష్టలతో ఉత్సావాలను నిర్వహిస్తారు. ఈ మేరకు మంగళవారం దండారీ ఉత్సవాల ముగింపు సంధర్భంగా ఘనంగా వేడుకలను నిర్వహించి ముగించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సిడం జైతు పటేల్, రాయిసిడం సోనేరావ్, పెందూర్ ప్రభాకర్, సిడం గణపతి, ఉయిక మోతిరాం, కుడ్మెత జల్లు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి చెస్ పోటీల నిర్వహణ



నవతెలంగాణ-మందమర్రి

ఎస్‌జీఎఫ్ మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లుల శివ సౌజన్యంతో లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో మంగళవారం అండర్-14, 17 జోనల్ స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సిహెచ్ ఫణిరాజ్, రాష్ట్ర చదరంగం అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ ప్రారంబించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, నల్లుల శివ, నల్లుల శంకర్, ఆసిఫాబాద్ ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్, ఉమ్మడి జిల్లా చదరంగం అభివృద్ధి ఛైర్మన్ ఈగ కనకయ్య, పాఠశాల కరస్పాండెంట్ సిద్దయ్య, చీఫ్ అర్బిటర్ కల్పన, ఆసిఫాబాద్ జిల్లా జాయింట్ సెక్రటరీ రవీందర్, ఎల్ఎఫ్ఎస్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, పీఈటీ కుమార్, రేణుక, మిమ్స్ పీఈటీ శ్రీనివాస్, ఆర్గనైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి వద్దే డెలివరీ చేసిన 108 సిబ్బంది

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన భూలక్ష్మికి కాసిపేట 108 సిబ్బంది ఇంటి వద్ద డెలవరీ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. భూలక్ష్మికి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. దీంతో అందుబాటులో ఉన్న కాసిపేట 108 అంబులెన్స్ సమాచారం అందడంతో ఇంటికి వెళ్లగా నొప్పులు తీవ్రం కావడంతో ఇంటి వద్దే కాన్పు చేశారు. దీంతో మహిళ మూడో కన్పు కాగా ఆడ శిశువుకు జన్మనివ్వగా ఇద్దరూ క్షేమంగా ఉండడంతో బెల్లంపల్లి ఆస్పత్రికి తరళించారు. ఈ మేరకు కాసిపేట 108 అంబులెన్స్ ఈఎంటీ ఆత్మారావు, పైలట్ అసద్ పాషాకు మహిళ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

● సీనియర్ సివిల్ జడ్జి అర్పిత

నవతెలంగాణ-హాజీపూర్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి అర్పిత

రైతు లేకపోతే ప్రపంచం ఆగిపోతుందని సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపేట్ రైతు వేదికలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. రైతులు ఫెస్టిసైడ్స్ లేని సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. 10 రోజులు బ్రతికిన ఆరోగ్యంగా బ్రతకాలన్నారు. జాతీయ రహదారి 63లో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు పలు అనుమానాలను జడ్జికి తెలియజేయగా సలహాలు ఇచ్చారు. రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకుంటే టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని పంటసాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను వాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేఖ, తహశీల్దార్ శ్రీనివాస్ దేశ్పాండే, ఏఓ కృష్ణ, లీగలైడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు ఆర్ఆర్ రాములు, ఎండీ సందాని, సేంద్రియ వ్యవసాయ రైతులు గోనే శ్యాంసుందర్ రావు, పున్నూరు శ్రీనివాస్‌రావు, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



నవతెలంగాణ-తాండూర్

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని, ఫిర్యాదు దారులకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. 100 డయల్‌కు సత్వరమే స్పందించాలన్నారు. బ్లూ కోర్టు సిబ్బంది నిత్యం గస్తీలో ఉండాలని ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. తాండూర్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాలు కార్డెన్ చర్చ్‌లు నిర్వహించాలని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో అనుమానితుల కదలికలను కనిపెడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని సూచించారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది కొరతను అధికమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో సింగరేణి స్కూల్ మైదానంలో మంగళవారం సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఏరియా జీఎం దేవేందర్ ఒలంపిక్ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ 11 ఏరియాల క్రీడాకారులకు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లకు, అధికారులకు, యూనియన్ నాయకులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆటల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వం కలుగుతుందన్నారు. క్రీడాకారులు అందరూ స్పోర్ట్స్ మెన్ స్పిరిట్‌తో పాల్గొని గెలుపు ఓటములను సమానంగా భావించాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నిలో గెలుపొందిన క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో పాల్గొని ఉత్తమ ప్రతిభతో పథకాలు సాధించి సింగరేణి ఖ్యాతిని దేశమంతా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరి సత్యనారాయణ, సీఎంఓఏఐ అధికారి పైడిశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, స్పోర్ట్స్ సమన్వయకర్త సీనియర్ పిఓ కార్తీక్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ కార్పొరేట్ పాస్నెట్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు జాన్ వెస్లీ, అశోక్, రమేష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ కృష్ణ, జనరల్ క్యాప్టన్ సాక శ్రీనివాస్, 11 ఏరియాల క్రీడాకారులు, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

పులి, చిరుత దాడిలో మృతి చెందిన ఆవులకు పరిహారం

● 24 గంటల లోపే బాధిత రైతుకు పరిహారం అందజేత



నవతెలంగాణ-కాసిపేట / లక్షెట్టిపేట్

పెద్దపులి, చిరుత పులి దాడిలో మృతి చెందిన ఆవులకు ఫారెస్ట్ అధికారులు పరిహారం అందించారు. మంగళవారం మంచిర్యాల ఫారెస్ట్ కార్యాలయంలో చెక్కును బాధిత రైతులు అందించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని గొండుగూడెం రైతుకు చెందిన మూడు ఆవులు ఆదివారం సాయంత్రం లక్షెట్టిపేట రేంజ్‌లోని మేడారం సెక్షన్ పరిధిలో మేతకు వెళ్లగా మూడు ఆవులపై పెద్దపులి, చిరుతలు దాడి చేశాయి. ఈ దాడిలో మూడు ఆవులు మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట ఎఫ్ఆర్ఓ సుభాష్, ముత్యంపల్లి సెక్షన్ డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారి తిరుపతి పంచనామా నిర్వహించి, వాటి విలువ రూ.39 వేలుగా నిర్ణయించగా మంచిర్యాల ఎఫ్ఎస్ఓ సర్వేశ్వర్, డీఎఫ్ఓ, కవ్వాల్ ఎఫ్ఏపీటీ సూచన మేరకు బాధిత రైతు చిత్రుకు రూ.33000 పరిహారం చెక్కును అందించారు. ఎవరైనా రైతులు ఆవులు పులి దాడిలో మృతి చెందితే తమకు సమాచారం అందిస్తే సాయం అందిస్తామని అటవి శాఖ అధికారులు వివరించారు. అటవీ ప్రాంతంలో చిరుత పులి, పులులకు హాని కలగకుండా చూడాలని కోరారు. వన్యప్రాణులను వేటడానికి ప్రయత్నాలు చేయకూడదని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో మనుషులు ఎవరు కూడా వెళ్లొద్దని పులికి సంబంధించిన సమాచారం తెలిస్తే సంబంధిత ఆటవీ అధికారులకు చెప్పాలని కోరారు. అటవీ శాఖ చరిత్రలోనే పెద్దపులి, చిరుత పులి దాడిలో మృతి చెందిన ఆవులకు 24 గంటల లోపే సాయాన్ని అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మేడారం ఎఫ్ఎస్ఓ అహ్మద్ ఆలీ, ఎఫ్బీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహక రుణాలు



తాండూర్ : కుటీర పరిశ్రమలకు స్వల్పకాలిక దీర్ఘకాలిక రుణాలు అందించి యువకులను మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇందల్ తెలిపారు. 2024 సంవత్సరానికి గాను తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు అందించే సేవలను గురించి నవతెలంగాణకు వివరించారు. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మండలంలోని 257 మంది యువకులకు మహిళలకు రూ. కోటి 87 లక్షల రుణ పరపతి సౌకర్యాన్ని అందించినట్లు తెలిపారు. తాండూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో 27456 మంది ఖాతాదారులు వ్యాపార లావాదేవీలను వినియోగించుకున్నాట్లు తెలిపారు. 22,780 మంది ఖాతాదారుల నుంచి రూ.95 కోట్ల ఒక లక్ష డిపాజిట్లను సేకరించినట్లు వివరించారు. ఫిక్స్ డిపాజిట్ లపై సీనియర్ సిటిజన్లకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వడ్డీని చెల్లిస్తుందన్నారు. మొత్తం 4675 మంది రైతు ఖాతాలు ఉండగా వ్యవసాయ అభివృద్ధి, సాగు ఖర్చులకు గాను రైతులకు రూ.90 కోట్ల 10 లక్షల రుణ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. మండలంలోని స్వయం సహాయక బృందాలకు రూ.40 కోట్ల 12 లక్షల రుణ పరపతి సౌకర్యాన్ని కల్పించామన్నారు. మహిళా సంఘాలకు వ్యక్తిగత రుణాలను అందించి కుటీర పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. 210 మంది నిరుద్యోగులైన ఖాతాదారులకు నిరుపేద మహిళలకు ముద్ర రుణాలు అందించామన్నారు. ప్రభుత్వ విధానాలను అనుసరించి రైతులకు ఎస్ఎస్సి గ్రూపులకు రుణమాఫీ వడ్డీ రాయితీ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల కోసం తక్కువ ప్రీమియంతో ప్రభుత్వ బీమా పథకాలను వర్తింపజేసే విధంగా కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. మండల పరిధిలోని గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యతపై సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నమన్నారు. పరపతి వినియోగం డిజిటల్ లావాదేవీలు పొదుపు మార్గాలు మూఢనమ్మకాలపై గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాపోలు విష్ణువర్ధన్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల



తెలంగాణ ప్రయివేటు పాఠశాలల సంఘం (ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాపోలు విష్ణువర్ధన్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నవంబర్ 4వ తేది సోమవారం చర్లపల్లి, హైదరాబాదులో ట్రస్మా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా రాపోలు విష్ణువర్ధన్ రావు విద్యారంగ సమస్యల పట్ల వారు చేసిన పోరాటం గుర్తించి వారిని ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అదే విధంగా మంచిర్యాల జిల్లా నుండి రాష్ట్ర అడ్వైజర్ కస్తూరి పద్మ చరణ్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ యార్లగడ్డ బాలాజీ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సురభి శరత్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అఖిలేందర్ సింగ్, రాం వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాపోలు విష్ణువర్ధన్ రావు మాట్లాడుతూ తనకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అదేవిధంగా మంచిర్యాల జిల్లా నుండి పలువురిని రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘవేందర్ రెడ్డి, చీఫ్ అడ్వైసర్ యాదగిరి శేఖర్ రావు, 33 జిల్లాల పాఠశాలల కరస్పాండెంట్ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా ప్రత్యేక అధికారి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మొర్రిగూడ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీఓ కిషన్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.

అధికారులను సన్మానించిన టీబీజీకేఎస్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల కాలంలో ఆర్జీ-2 ఏరియా నుంచి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలిపై వచ్చిన జనరల్ మేనేజర్ సూర్యనారాయణను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ రాయుడు ఎస్ఓటు జీఎంగా ఉద్యోగోన్నతి పొందిన ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్గా నియమితులైన జక్కారెడ్డికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజ్ సెక్రెటరీ పొగాకు రమేష్, చీఫ్ ఆర్గనైజ్ సెక్రెటరీ అన్వేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, కురుమ వికాస్, ఉత్తేజ్‌రెడ్డి, రమణారెడ్డి, నరేష్, సాల్మన్, దుర్గంరవి పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేశాడని మహిళా ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలం పెరికపల్లెకు చెందిన పనాస మమతను మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బిల్ల రమేష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడని మంగళవారం ఆయన ఇంటి ముందు పురుగుల మందుతో బైఠాయించి ఆత్మహత్యాయత్నం చేసింది. పెళ్లి అయిన ఆమెను భర్త వేధిస్తుండగా విడాకులిచ్చేందకు కోర్టులో కేసు వేశానని, రమేష్ తనను అన్ని రకాలుగా వాడుకున్నాడని అన్నారు. అతని కోసం వస్తే ఇప్పుడు వద్దంటున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. గత రెండు రోజుల క్రితం వేరే అమ్మాయితో నిశ్చితార్థం చేసుకుని మోసం చేస్తున్నాడని అన్నారు. అయినప్పటికి తనతో ఉండాలని నిర్ణయించుకుంటే అవసరం లేదంటూ వేధిస్తున్నాడని తెలిపింది. 2 రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరగా వారు ఇక్కడ కాదు. బెల్లంపల్లిలో ఫిర్యాదు చేయాలంటున్నారని తెలిపింది. బిళ్ళ రమేష్‌తో వివాహం జరిగితే గాని వెళ్ళనని ఇంటి ముందు బైటాయించింది.

రైల్వేస్టేషన్‌లో సింగరేణి కార్మికుడి మృతి

నవతెలంగాణ-మందమర్రి



రామకృష్ణాపూర్ రైల్వే స్టేషన్ పట్టాల వద్ద మంగళవారం వ్యక్తి చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మందమర్రి పట్టణం 3వ జోన్‌కు చెందిన గురిజాల మొగిలి(60)గా గుర్తించినట్లు తెలిపారు. మొగిలి మందమర్రి ఏరియా కళ్యాణి కని ఓపెన్ కాస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్నట్లుగా తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | నవంబర్ 06, 2024 | www.navatelangana.com

బెల్లంపల్లి ఏరియాలో డీడీఎం పర్యటన

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలో డీడీఎం (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) కె.ప్రేంకుమార్ పర్యటించారు. ఖైరగూడ ఓసీ పని స్థలాలకు చేరుకొని బ్లాస్టింగ్ విధానాన్ని పరిశీలించారు. బ్లాస్టింగ్ సమయంలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై ఆరా తీశారు. ఈస్ట్ వ్యూ పాయింట్ నుండి బ్లాస్టింగ్‌ను వీక్షించారు. రక్షణ చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. అంతకుముందు జీఎం కార్యాలయంలో జీఎం ఎం.శ్రీనివాస్ అధికారులతో కలిసి ఆయనను సన్మానించి పూల మొక్కతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీఓ ఎం.నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

తెలుగు భాషపై సంపూర్ణ అవగాహన ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలుగు భాష పట్ల ప్రతీ విద్యార్థికి సంపూర్ణ అవగాహన ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా తెలుగు భాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో ప్రతీ తరగతిలో ఒక గ్రంథాలయం పీరియడ్ ఉండేలా చూడాలన్నారు. ఆరెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పర్వ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకటి, రెండో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవాజీ, రూం టు రీడ్ కో ఆర్డినేటర్ పద్మశ్రీ, తెలుగు బోధన రిసోర్స్ పర్సన్‌లు టి రాజమణి, ఎస్ రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిద్దిపేట జిల్లాలో ఈ నెల 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇందులో బాలికల విభాగంలో మౌనిక, అమూల్య, అనిత, ఆలేఖ్య, ఇంద్రజ, యోచన, మధురాక్షి, బాలుర విభాగంలో మహేష్, ప్రణయ్, కీర్తన్, సాయి, చరణ్, వివేక్ ఎంపికయ్యారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి డీఈఓ యాదయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, కోచ్‌లు అరవింద్, సాయి, రాకేష్, ఫైన్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, గిరిజన జిల్లా క్రీడా అధికారి బండ మీనారెడ్డి అభినందించారు.

నేడు సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైబర్ జాగరకృత్ దివస్ సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలోని విశ్రాంత సంఘ భవనంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. దీంతో పాటు విశ్రాంత ఉద్యోగుల వివిధ సమస్యలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలు విశ్రాంత ఉద్యోగులు ప్రతి ఒక్కరు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామంలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన భూంపల్లి జయప్రదను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలకు చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, గుండి మాజీ ఎంపీటీసీ గాదవేణి మల్లేష్, మాజీ సర్పంచ్ జబరి అరుణ-రవీందర్, మాజీ సర్పంచ్ దత్తు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్ రావు, నాయకులు విశ్వనాథ్, కమలాకర్, రాజు, దాదారం, రమేష్, సంతోష్, రాజు రమేష్, బికాజీ, సాదు పాల్గొన్నారు.

నాస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ సాధన సర్వే 2024లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జాతీయస్థాయిలో నేషనల్ అచీవ్మెంట్ సర్వే జరుగుతుందని, దానికి సంబంధించి 3వ, 6వ, 9వ తరగతి విద్యార్థులకు అభ్యసన ఫలితాలు సాధించేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు శంకర్, చైతన్య పాల్గొన్నారు.

భూగర్భ జలాలను సరిగ్గా వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భూగర్భ జలాలను సరిగ్గా వినియోగించుకోవాలని భూగర్భ జల శాఖ అధికారిణి శ్రీవల్లి అన్నారు. మండలంలోని మోవాడు గ్రామపంచాయతీలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూగర్భ జలాల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాలలో బావులు తవ్వాలంటే తమ శాఖను సంప్రదిస్తే సరైన సలహాలు అందిస్తామన్నారు. మట్టి విధానాన్ని తెలుసుకోవడంతో పాటు భూగర్భ జలాల నీటిని వృథా పోకుండా చూడాలన్నారు. నీటిని భూమిలోకి ఇంకేలా చూస్తే వేసవి కాలంలో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో భూగర్భ జల శాఖ అధికారి నవీన్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సంతోష్, మిత్ర ఫౌండేషన్ పేందూర్ రాజేష్, బాదు పటేల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరానికి 28 మంది హాజరు కాగా ఇందులో 11 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలోనే బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అప్తామలజిస్ట్ గోపి పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని యాపల్‌గూడ, ఇసురుగూడ, బోరిగాం గ్రామాల్లో పశువులకు ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకలు తప్పకుండా వేయించాలని పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఆర్‌టీయూటీఎస్ సభ్యులు

నవతెలంగాణ-నేరడిగొండ



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో ఎస్‌టిఓ విద్యాసాగర్, పిఆర్‌టియుటిఎస్ నాయకులు తానాజీ, బిక్కులాల్, రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

అంతరిక్ష అన్వేషకులను ప్రోత్సహించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్



భవిష్యత్తు తరం అంతరిక్ష అన్వేషకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, ప్లానెటరీ సొసైటీ, ఇండియా సంస్థల సహకారంతో, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చారిత్రాత్మక మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళయాన్) 11వ వార్షికోత్సవాన్ని జరుపుకునేందుకు నిర్వహించిన వర్క్‌షాప్‌కు ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ అటువంటి విద్యా వర్క్‌షాప్‌లను నిర్వహించడం ద్వారా యువ విద్యార్థులలో అంతరిక్ష అన్వేషణపై ఉత్సుకత అభిరుచిని రేకెత్తిస్తుందన్నారు. అనంతరం డైరెక్టర్ రఘునందన్ మాట్లాడుతూ విద్యార్థులకు స్పేస్ ల్యాబ్ అందుబాటులోకి తేవాలని కోరారు. దీని ద్వారా అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గెజిట్ విడుదలైన నేపథ్యంలో అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు వేతన సవరణ, అద్దె బస్సులను రద్దుచేసి ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతినెల రూ.350 కోట్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ దివాకర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ జేఏసీ నాయకులు అశోక్, గుజ్జ మోహన్ బాబు, హరికృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర స్థాయి నెట్ బాల్ సబ్ జూనియర్ పోటీలకు విద్యార్థుల ఎంపిక జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అలీ బిన్ అహ్మద్, తిరుపతిలు మాట్లాడుతూ పోటీల్లో వివిధ పాఠశాలల నుండి విద్యార్థి, విద్యార్థినీలు సుమారు 80 మంది పాల్గొన్నారని, వారిలో ప్రతిభ కనబరిచిన బాలుర జట్టు 12, బాలికల జట్టు 12 మొత్తం జిల్లా స్థాయి నుండి 24 మందిని ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచలని జిల్లాకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల వల్ల మానసిక ఆరోగ్యం మెరగవుతుందనీ ప్రతి ఒక్కరూ ఆడాలని తెలిపారు. ఈ నెల 8 నుండి 10 వరకు ఎన్టీఆర్ స్టేడియం నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఈ జట్లు తలపడనున్నాయన్నారు. కార్యక్రమంలో పీఈటీ, పీడీలు, కోచ్ సీహెచ్ ఏడుకొండలు, అంకిల, నాగరాణి పాల్గొన్నారు.

బుద్ధిస్టులు, మహార్‌గా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని బౌద్ధులు నేటి నుంచి నిర్వహించనున్న కులగణనలో కులమున్నచోట మహార్ గా, మతమున్నచోట బౌద్ధమని నమోదు చేసుకోవాలని జిల్లా బౌద్ధ సంఘం నాయకులు సూచించారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గడిచిన 30, 40 సంవత్సరాల నుండి మేము మహర్లుగా ఉంటూ మాల కుల సర్టిఫికెట్లను నేతగాని కుల సర్టిఫికెట్లను తీసుకొని నష్టపోయామన్నారు. కులగణన దళితవాడలలో విజయవంతం చేయడానికి సెంటర్ కమిటీ లుంబిని దీక్ష భూమి కమిటీ, అంబేద్కర్ సంఘం భారతీయ బౌద్ధ మహా సభ, జై భీమ్ సేన, సిద్ధార్థ యువజన సంఘం, రామాబయి మండలి, దళిత యువజన సంఘాలు విద్యావంతు, యువకులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రానున్న తరానికి బౌద్ధాన్ని అందించడమే బౌద్ధ సంఘం నాయకుల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మాహుల్కర్, జిల్లా కోశాధికారి తిరుపతి, సమతా సైనిక దళ్ జిల్లా ఇన్‌చార్జి జాడే దిలీప్ కుమార్, జై భీమ్ సేన జిల్లా కార్యకర్తలు, సెంటర్ కమిటీ అధ్యక్షులు దుర్గం హుక్టుకి, కార్యదర్శి దుర్గం సుధాకర్, నాయకులు రవిదాస్ జాడే, జనార్ధన్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు వస్తుంటారని వారికి కావాల్సిన కనీస సౌకర్యాలు కూడా కార్యాలయం ఆవరణలో లేవన్నారు. ముఖ్యంగా కనీస అవసరాలు అయినా మంచినీటి సౌకర్యం, టాయిలెట్ వసతి, ప్రహరీ గోడ, సిబ్బంది టాయిలెట్, విశ్రాంతి గది, తహసీల్దార్‌కు అధికారిక విశ్రాంతి గృహం, లాంటి సమస్యలు పరిష్కరించాలని మండల కమిటీ ఆధ్వర్యంలో కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి భానుచందర్, రాచర్ల రవి కిరణ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని పిచ్చాస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని వేలాల గ్రామానికి చెందిన మతిస్థిమితం కోల్పోయిన ఆకుదారి కత్తెరసాల అనే వ్యక్తిని హైదరాబాద్‌లోని పిచ్చాస్పత్రికి తరలిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మతిస్థిమితం లేక గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కత్తెరసాలను మంగళవారం చెన్నూర్ కోర్టు న్యాయమూర్తి రవి ఎదుట హాజరుపర్చగా సదరు వ్యక్తిని పిచ్చాసుపత్రిలో చేర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. మానసిక వ్యాధితో ప్రజలను భయపెట్టిస్తుండటంతో పాటు వేలాల మల్లికార్జునస్వామి ఆలయం తాళాలు పగులగొట్టడం, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

సర్వేను సకాలంలో పూర్తి చేయాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ఈ నెల 6 నుండి ప్రారంభమయ్యే సర్వే కార్యక్రమంపై ఉపాధ్యాయులకు కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, పంచాయితీ, మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సర్వే నిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జన్నారం : జన్నారం మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ శశికళ తెలిపారు. మండలంలో మొత్తం 29 గ్రామపంచాయతీలు 33 గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో 17,392 ఇళ్లు ఉండగా, 52,883 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో సర్వే చేసేందుకు మొత్తం 12 మంది సూపర్‌వైజర్లను కేటాయించారు. 123 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి ఫీల్డ్ సర్వే చేసి, కులం, మతం, ఆదాయం, ప్రస్తుత సామాజిక పరిస్థితులను రికార్డు చేస్తారని అన్నారు. సర్వే చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి సరైన సమాధానాలు ఆధారాలు చూపిస్తూ సర్వేకు సహకరించాలన్నారు. సమగ్ర సర్వేను పూర్తిస్థాయిలో సంపూర్ణం చేయడానికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఇంటింటి కుటుంబ సర్వే

జైపూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు మంగళవారం సర్వే విధి విధానాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ అవగాహణ కల్పించారు. సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ కుల సర్వే కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి సర్వేపై శిక్షణ కార్యమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, మండల విద్యాధికారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బెజ్జూర్ : నేటి నుండి ఇంటింటికి కుల గణన సర్వే ప్రారంభమవుతున్నట్టు ఎంపీడీఓ గౌరీ శంకర్ మంగళవారం తెలిపారు. ఈ సర్వే కోసం మండలంలో 72 మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఇప్పటికే వారికి శిక్షణ అందించామన్నారు.

వాంకిడి : మండలంలో నేటి నుండి కుల గణన సర్వే నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ రియాజ్ అలీ తెలిపారు. ఇంటింటికి తిరిగి పూర్తి వివరాలను తెలుసుకోవడం జరుగుతుందని సర్వే చేసిన ఇంటిని స్టిక్కర్లను కూడా అంటిస్తారన్నారు. కులగణలో పాల్గొనే సిబ్బందికి అందరు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లాలో బుధవారం నుండి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 473 గ్రామపంచాయితీల పరిధిలో 1,49,161 ఇళ్లలో 1,612 ఎన్యుమరేటర్లు, 173 సూపర్‌వైజర్లు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 48,393 ఇళ్లలో 385 ఎన్యుమరేటర్లు, 41 సూపర్వైజర్లు సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. సర్వే ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

తలమడుగు : మండలంలో బుధవారం నుండి ప్రారంభమయ్యే కుటుంబ సమగ్ర సర్వేకు మండల ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేకు ఎన్యుమరేటర్స్ ప్రతి ఇంటికి వెళ్తారని, కుటుంబ యజమానితో పాటు సభ్యులందరూ తమ వివరాలు నమోదు చేసుకొని సహకరించాలని కోరారు.

సెక్యూరిటీ ఆఫీసర్‌కు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్‌గా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన ఉమాకాంత్‌ని సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఫిట్ కార్యదర్శి కందుల మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.జగ్గయ్య, శేషశైనా రావు, జూపాక రాజేష్, మీస చంద్రశేఖర్, దేవరకొండ దివాకర్, డి.రాజయ్య, మారం శ్రీనివాస్, సెక్యూరిటీ విభాగం సహాయ కార్యదర్శి జాంగిర్, తపన్ మండల్, గొర్ల శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్ చంద్రయ్య పాల్గొన్నారు.

రూం టూ రీడ్‌పై ఒక్క రోజు శిక్షణ

నవతెలంగాణ-కౌటాల

రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ సౌజన్యంతో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఒక రోజు ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి తెలుగు బోధించే ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండాయిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం గొడం నానాజీ హాజరై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్లాక్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, సంపతి, సీఆర్పీలు దేవన్న, లాలాజీ, ప్రకాష్, లుల్లాజి, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుమన్ పాల్గొన్నారు.

